ప్రజాశక్తి
సోమవారం 20 జనవరి 2025

అనంతపురం నగరంలో గాంధీ విగ్రహం దద్ద వామపక్ష నాయకుల నిరసన

అమిత్‌షా గోబ్యాక్

ప్రజాశక్తి - అనంతపురం

డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా అనంతపురం జిల్లా వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి. సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ తదితర పార్టీల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటన నేపథ్యంలో నాయకులు ఆదివారం నిరసనలు చేశారు. అమిత్‌షా గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. జిల్లాలోని అనంతపురం, రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, బొమ్మనహాల్ తదితర ప్రాంతాల్లో నిరసనలు చేపట్టారు.

రాళ్ల గుట్టలు, ఇరిగేషన్ భూములు మాయం...

- బడా బాబులకు కొమ్ముకాస్తున్న అధికారులు
- ప్రభుత్వ భూముల్లో భవనాలు నిర్మిస్తున్నా పట్టించుకోని వైనం
- రోడ్డుపక్కన బంకులు వేసుకున్న వారిపై ప్రతాపం

బడా బాబులు తలుచుకుంటే ఏమైనా చేయగలరు, రెవిన్యూ అధికారులు తలచుకుంటే రాళ్ళ గుట్టలు సైతం సాధారణ భూములుగా మారుతాయి. ఇదే పరిస్థితి శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ప్రభుత్వ భూములకు వర్తించింది. ప్రభుత్వ భూములకు రక్షణగా నిల్వవలసిన రెవెన్యూ అధికారులే భూ బకాసులకు కొమ్ముకాస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది.

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తిలో ఇరిగేషన్ భూములే కాదు రాళ్ల గుట్టలు కూడా మాయమవుతున్నాయి. 2024 ముందు రెవెన్యూ రికార్డుల్లో రాళ్ల గుట్టలు, ఇరిగేషన్ భూములుగా ఉన్న ప్రభుత్వభూములు 2025 కి పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ప్రస్తుతం రెవిన్యూ రికార్డులు తనిఖీ చేస్తే ఆన్లైన్లో పలు ప్రముఖుల పేర్లతో 1బి కనిపిస్తోంది. ఇది ఎవరి తప్పిదం? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఓ ప్రైవేట్ విద్యాసంస్థ అధినేత పేరిట 2.45 ఎకరాలే కాకుండా మరో 0.77 ఎకరాల రాళ్లగుట్ట సైతం ఆయన పేరిట 1బి ఆన్లైన్లో కనిపిస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ రాళ్లగుట్టలకు రెవెన్యూ అధికారులు ఎప్పటినుంచి 1బిలు ఇష్యూ చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పేదలు ఇల్లు నిర్మించుకోవడానికి భూములు కేటాయించాలని ప్రజా సంఘాల నాయకులు రెవిన్యూ అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తున్నా పట్టించుకోవటం లేదు. అయితే ఆ ప్రయివేటు విద్యాసంస్థ అధినేతకు ఎకరాలు మీద ఎకరాలు భూములు చేయిస్తున్నారు. ఎనుములపల్లిలో పేదలు సాగు చేసుకుంటున్న భూమిని రైతులకు తెలియకుండా రహదారిగా మార్చేశారు. ఇలా పేదలకు తెలియకుండా రెవిన్యూ రికార్డులు మార్చేయడం దారుణమని రైతులు వాపోతున్నారు. అదేవిధంగా పుట్టపర్తిలోని పశు వైద్యశాల పక్కన ఉన్న ఇరిగేషన్ భూమిలో కొందరు పేదలు పొట్టకూటి కోసం కొన్ని బంకులు ఏర్పాటు చేసుకున్నారు. నిత్యం చిరు వ్యాపారం చేసుకుంటూ కూలి డబ్బులు సంపాదించుకుంటున్న పేదలపై ఇరిగేషన్ మున్సిపల్ అధికారులు తమ ప్రతాపం చూపిస్తున్నారు. వెంటనే ఖాళీ చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. బడా బాబులు ఇరిగేషన్ భూముల్లో భవంతులు నిర్మిస్తున్నా, 1బిలు చేయించుకుంటున్నా ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం ఎక్కడి న్యాయమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పొట్టకూటి కోసం జీవనం సాగిస్తున్న తమపై వేధింపులు ఆపి, ఇరిగేషన్ భూముల్లో భవంతుని నిర్మించిన వారిపై చర్యలు చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

పొట్ట కొట్టొద్దు

5 సంవత్సరాల నుంచి టీస్టాల్ నడుపుకుంటున్నాను. మా పిల్లలను దీని ద్వారానే పోషించుకోగలుగుతున్నాను. ఇప్పుడు ఉన్నట్టుండి ఇరిగేషన్ భూమిలో ఉన్న టీస్టాల్ ఖాళీ చేయాలని మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేయడం దారుణం. ఉన్న ఈ ఉపాధి పోతే కుటుంబం రోడ్డున పడుతుంది. కలెక్టర్ స్పందించి మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

రవి, బాధితుడు
హోటల్ యజమాని, పుట్టపర్తి

కుటుంబం రోడ్డున పడుతుంది

10 సంవత్సరాల నుంచి ఇరిగేషన్ భూమిలో చిన్న హోటల్ పెట్టుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాను. హోటల్‌లో నేను, నా భార్య రోజంతా పనిచేస్తే దిన కూలి గిట్టుబాటు అవుతుంది. ఇప్పుడు ఉన్నట్టుండి మున్సిపల్ అధికారులు హోటల్ తొలగించమని చెప్పడంతో రోడ్డున పడాల్సివస్తుంది. అధికారులు మాపై దయ ఉంచి హోటల్ ఖాళీ చేయకుండా చేయండి.

నాగమణి,
టీ స్టాల్ నిర్వాహకులు, పుట్టపర్తి

న్యాయం చేయండి

ఇరిగేషన్ భూమిలో బంకును వేసుకున్నది వాస్తవమే. కానీ రోడ్డులో ఎవరికి కూడా ఇబ్బంది కలిగించకుండా మా పనులు చేసుకుంటున్నాం. రోజు కూలి సంపాదించుకుంటూ ఇక్కడ పని చేసుకుంటున్నాను. కానీ ఇప్పుడు ఉన్నట్టుండి ఖాళీ చేయమని చెప్పడంతో దిక్కుతోచలేదు. ఉన్న ఉపాధి పోతే మా కుటుంబం రోడ్డున పడుతుంది. అధికారులు మాకు న్యాయం చేయాలి.

షరీఫ్,
ఏసీ మెకానిక్, పుట్టపర్తి

ఆదుకోండి

కరోనా సమయంలో రోగులకు ఆహారాన్ని మా హోటల్ నుంచి సరఫరా చేసాం. కానీ ఇప్పటివరకు డబ్బులు చెల్లించలేదు. దీంతో అప్పులు ఎక్కువై బాడుగలు చెల్లించలేక ఉన్న హోటల్ సైతం అమ్ముకున్నాము. ఇప్పుడు ఇక్కడ చిన్న హోటల్ ఏర్పాటు చేసుకుంటే ఉన్నట్లుండి ఖాళీ చేయమని చెప్పడంతో రోడ్డున పడ్డాము. కలెక్టర్ స్పందించి మమ్మల్ని ఆదుకోవాలని కోరుతున్నాను.

సత్యవతి,
హోటల్ నిర్వాహకులు, పుట్టపర్తి

స్థావరాలు బంద్.?

ఉన్నతాధికారుల హెచ్చరికలతో పేకాటకు బ్రేక్
కొత్త మార్గాలకై వెతుకులాట

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో జూద స్థావరాలపై పోలీసు శాఖ నిఘా పెంచింది.ఇప్పటి వరకు వ్యవస్థీకృతంగా సాగుతూ వచ్చిన జూద స్థావరాలపై నిఘా పెట్టడమే కాకుండా నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేసినట్టు తెలుస్తోంది. దీంతో తాత్కాలికంగా ఈ జూద క్షేత్రాలకు పుల్‌స్టాప్ పడింది. అయితే ఇది ఎంతకాలం కొనసాగుతుందన్నది చూడాల్సి ఉంది. ఎందుకంటే ఈ క్షేత్రాల వెనుక ముఖ్యమైన నేతల ప్రమేయం కూడా ఉందన్న ఆరోపణలున్నాయి. వారి అండదండలతోనే చాలకాలంగా జూదక్షేత్రాలు పెద్దఎత్తున ఉమ్మడి జిల్లాలో సాగుతూ వచ్చాయన్న ప్రచారం నడుస్తోంది. అయితే దీనిపై ఇటీవల సీరియస్‌గా దృష్టి సారించినట్టు సమాచారం.అంతేకాకుండా నిర్వాహకులకే కాకుండా ముఖ్య నేతలకు కూడా హెచ్చరికలు చేయడంతో వీటిని మూసేసుకున్నట్టు తెలుస్తోంది. అయితే ఇప్పుడు వీటి నిర్వహణకు కొత్త మార్గాల కోసం నిర్వాహకులు ప్రయత్నాలు ముమ్మరం చేసుకుంటున్నట్లు సమాచారం.

రూ. కోట్లలో సాగిన క్షేత్రాలు

మొన్నటి వరకు ఉమ్మడి జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో ప్రధానంగా జూద క్షేత్రాలు పెద్దఎత్తున నడిచాయి. ఒక్కో క్షేత్రంలో రోజుకు మూడు కోట్ల రూపాయల వరకు కూడా లావాదేవీలు సాగినట్లు తెలుస్తోంది. అవి కూడా ఒక పకడ్బందీ ప్రకారం నడుస్తూ వచ్చాయి. జూదరలు జూద క్షేత్రానికి రావడానికి అవసరమైన రవాణ సౌకర్యాన్ని నిర్వాహకులే ఏర్పాటు చేసేవారు. వారికి భోజన సౌకర్యం కూడా ఏర్పాటై ఉండేది. జూద క్షేత్రాలకు తరలించేందుకు పదుల సంఖ్యలో వాహనాలు ఏర్పాటై ఉండేవి. ఉదయం వాహనంలో జూదరులను తరలించడం, సాయంత్రం వారి ప్రాంతానికి చేర్చే వరకు ఏర్పాట్లు చేయబడి ఉండేవి. ఈ రకంగా వాహన యజమానులకు ఉపాధి ఉండేది. ఈ రకంగా ఉమ్మడి జిల్లాలో నాలుగైదు నియోజకవర్గాల్లో ఈ వ్యాపారం మూడు పువ్వులు...ఆరు కాయలుగా సాగుతూ వచ్చింది.

హెచ్చరికలతో తాత్కాలిక బ్రేక్

ఈ జూద క్షేత్రాలను గుర్తించిన పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా దృష్టి సారించారు. ఇదే సమయంలో డ్రోన్ల ద్వారా కూడా ఎక్కడ జూద క్షేత్రాలు నడుస్తున్నాయన్నది గుర్తించే ప్రయత్నం చేసినట్టు తెలుస్తోంది. గుర్తించిన ప్రాంతాల్లో ముఖ్య నేతలకు ఉన్నతాధికారి ఒకరు ఇక ఆట బంద్ చేసుకోవాలని సూచించినట్టు తెలుస్తోంది. చేసుకోకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని సుతిమెత్తగా హెచ్చరించినట్టు సమాచారం. దీంతో ఆటను తాత్కాలికంగా అయితే బంద్ చేసుకున్నారు. అధికారం వచ్చిన సమయంలో వచ్చే ఆదాయానికి గండిపెట్టినట్టయిందన్న అసంతృప్తి కూడా ముఖ్య నేతల్లోనున్నట్టు తెలుస్తోంది. అయితే కొత్త మార్గాల్లో దీన్ని కొనసాగిస్తారా లేక శాశ్వతంగా బంద్ చేసుకుంటారా అన్నది చూడాల్సి ఉంది.

ప్రజాకవి యోగివేమన

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

వేమన చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సామాజిక చైతన్యం కోసం పాటుపడిన ప్రజాకవి వేమన అనికలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఆదివారం జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ప్రజాకవి, సంఘసంస్కర్త యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ యోగివేమన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పుట్టడం, వారి మాటలు, పద్యాలు వింటూ పెరగడం మనందరి భాగ్యంగా భావించాలని అన్నారు. తాను గతంలో కడప యోగి వేమన యూనివర్సిటీలోకొన్ని కార్యక్రమాలు, పనులు చేయడం జరిగిందని, ఆ సమయంలో తన వంతు బాధ్యతగా చేశానని తెలిపారు. అయితే ఇక్కడ ఉన్నటువంటి కవి, రచయిత ఏలూరు ఎంకన్న ప్రసంగం ద్వారా యోగివేమన గురించి ఇంకా చాలా విషయాలు తెలుసుకున్నానని తెలిపారు. కర్నాటకలో సర్వజ్ఞ కూడా నాలుగు మాటలను నాలుగు పదాలుగా ఏర్పడి చివరన సర్వజ్ఞ అని ఉంటుందన్నారు. మంచి మాటలను ఎలా పంచాలో ప్రజలకు అర్థం అయ్యే భాషలో, వాడుక భాషలో ఊహాత్మకంగా యోగి వేమన ప్రజలకు చేరవేశారన్నారు. యోగివేమన చెప్పిన పద్యాలు, మాటలు చేతిరాతతో కాకుండా ప్రజల నోటి మాటలతో చిరకాలం గుర్తుండిపోయేలా ఉంటాయన్నారు. యోగివేమన లాంటి కవులు సులభమైన వాడుక భాషలో, పల్లె పల్లెలలో ఉపయోగపడే విధంగా విప్లవం తీసుకువచ్చారని తెలిపారు. 500 సంవత్సరాల పద్యాలు ఇప్పటికీ వాడుకలో ఉన్నాయని, వీటిని ముందుకు తీసుకువెళ్లే బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో దాదాపు 500 పుస్తకాలు ఉన్నాయని, ఆ పుస్తకాలలో పురాతన చరిత్ర, ఇతిహాసాలతో విషయాలు ఉన్నాయని, ఈ పుస్తకాలకు నెంబర్లు వేసి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఒక లైబ్రరీని తయారుచేసి వాటిలోని విషయాలు తెలుసుకుని, మిగతా వారికి తెలియజేసి మన సంస్కృతి, మన భాషను, మన దేశాన్ని, మన రాష్ట్రాన్ని, మన ఊరిని బాగుపరిచే విధంగా చూడాలన్నారు. కవి ఏలూరు ఎంకన్న యోగి వేమన చెప్పిన పద్యాలు, ఉపన్యాసం అందరినీ ఆకట్టుకున్నాయని తెలిపారు. ప్రభుత్వం ద్వారా నిర్వహించే కొన్ని కార్యక్రమాలలో యోగివేమన గురించి మాట్లాడే అవకాశం కల్పించడం జరుగుతుందని, తద్వారా ప్రజలకు భావితరాల వారికి యోగిని వేమన గురించి వారి పద్యాల గురించి తెలియజేసే విధంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా కలెక్టర్ కార్యాలయం ఏవో అలెగ్జాండర్, జిల్లా టూరిజం అధికారి జయ కుమార్ బాబు, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి గురుస్వామి శెట్టి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, మెజిస్టీరియల్ విభాగం సూపరింటెండెంట్ వసంతలత, భారత జాతీయ సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ సంస్థ సభ్యులు, కవులు ఏలూరు యంకన్న, శ్రీనివాసరెడ్డి, మధుర శ్రీ, కష్ణమూర్తి, అప్ప స్వామి, రామ్మోహన్ రెడ్డి, రియాజుద్దీన్, కమ్మదూర్ నబి రసూల్, నాగభూషణం, సూర్యనారాయణ రెడ్డి, రషీద్‌తో పాటు కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే..

సిఐటియు, రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకులు

మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కార్మికుల శ్రమను దోచిపెట్టి బానిసత్వాన్ని పెంపొందించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు.. చేసి ప్రాణాలు అర్పించి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యధాతదంగా అమలు చేయాలని కార్మిక, రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం గణేనాయక్ భవన్‌లో సిఐటియు నగర కార్యదర్శి వై.వెంకటనారాయణ అధ్యక్షతన సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుసంఘాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, కౌలు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాలరంగయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ముర్తుజ, పండ్ల తోటల రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. 72 గంటల నుంచి 94 గంటలు పని చేయాలని పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేయాలని రైతులు నిర్వహించిన సుదీర్ఘ పోరాటంలో కార్మికుల పాత్ర ఎనలేనిదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటు వ్యక్తులకు అప్పచెప్పే విధానాలు తక్షణం మానుకోవాలన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రభుత్వమే కొనసాగించాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కార్మిక చట్టాలు కొనసాగించాలన్నారు. వ్యవసాయ కార్మికులకు 200 రోజులు పని దినాలు కల్పించి రూ.600 రోజు వేతనం చెల్లించాలన్నారు. కౌలు రైతులకు గిట్టుబాటు ధర కల్పించి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు భగత్ సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ సెక్రటరీ శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బిహెచ్. రాయుడు, ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు గౌస్, ఆజాం బాషా, నాగరాజు, గోపాల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

జిల్లా పంచాయతీ అధికారి సమత

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పంచాయతీలలో ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించి ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపడతామని అందుకోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామని శ్రీ సత్య సాయి జిల్లా పంచాయతీ అధికారి సమత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : సంపద సృష్టి కేంద్రాల నిర్వహణ ఏ విధంగా ఉంది?

జవాబు : జిల్లా వ్యాప్తంగా సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లు 421 ఉన్నాయి. కార్మికులు గ్రామంలో సేకరించిన తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి , వాటిలో వానపాములను వదిలి ఎరువుగా తయారు చేసి ఆ ఎరువును రైతులకు కిలో 40 రూపాయలు చొప్పున అమ్మి దాని ద్వారా పంచాయతీకి ఆదాయం వచ్చే విధంగా చర్యలు చేపడతారు. పంచాయతీలలో ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించడం, వీధులను శుభ్రం చేయడం వల్ల పంచాయతీ పరిశుభ్రంగా ఉండటమే కాక , చెత్త ద్వారా సేకరించిన ప్లాస్టిక్ బాటిల్ ,ఇనుము ముక్కలు, సిల్వర్ ,తదితర వస్తువుల ద్వారా పంచాయతీలకు కొంత ఆదాయం లభిస్తుంది. ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించి ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపడుతున్నాం. పంచాయతీలలో, మున్సిపాలిటీలలో ప్లాస్టిక్ వాడకం నిషేధం పై ప్రజలకు అవగాహన కల్పించి అమలు జరిగే విధంగా చర్యలు చేపడతాం.

ప్ర : ఇటీవల పంచాయతీ అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. వాటి ద్వారా ఏయే పనులు నిర్వహిస్తున్నారు?

జ: శ్రీ సత్య సాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రధాన ద్వారం నుంచి మామిళ్ళకుంట వరకు, ప్రశాంతి రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక

పారిశుధ్య పనులు చేపట్టాము. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు, నివాస ప్రాంతాలు, మునిసిపాలిటీలు, ఆసుపత్రులు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లో శుభ్రపరిచే విధంగా చర్యలు చేపడుతున్నాం. ప్రతి మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టే విధంగా చర్యలు చేపడుతున్నాం. రహదారులు వెంబడి పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించి, తాగునీటి వసతి వంటి పనులను చేపట్టాము. జిల్లా వ్యాప్తంగా ఆయా పంచాయతీల్లో సిసి రోడ్ల నిర్మాణానికి వచ్చిన నిధులకు సరిపడా సీసీ రోడ్లు, డ్రయినేజీ పనులు పూర్తి అయ్యాయి.

ప్ర : పంచాయతీ సెక్రెటరీ గ్రేడ్ 5 ఉద్యోగుల వేతనాల సమస్యలపై మీ సమాధానం?

జ: పంచాయతీ సెక్రటరీల గ్రేడ్ 5 ఉద్యోగుల శాలరీ కొంతకాలం నుండి సమస్య నెలకొంది. ఎక్కడైతే కాళీ ఉంటే వాటిని గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి, అనంతపురం జిల్లా కేంద్రానికి వాటి సమాచారం పంపడం జరిగింది. వీరి శాలరీ సమస్య రెండు మూడు నెలల్లో పరిష్కారం అవుతుంది.

ప్ర : జిల్లావ్యాప్తంగా పంచాయతీల్లో ఏయే అభివద్ధి పనులు చేపడుతున్నారు, ఎంత నిధులు మంజూరు అయ్యాయి?

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీలలో డ్రైనేజీ, సిమెంట్ రోడ్లు, గ్రామంలో తాగునీటి సమస్య, వీధిలైట్లు ఏర్పాటు రోడ్ల మరమ్మతులకు మొదటి ప్రాధాన్యత నిస్తున్నాం. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి పంచాయతీలకు 2024 -25 సంవత్సరానికి గాను 15వ ఆర్థిక నిధుల క్రింద జిల్లాకు రూ.31.5 కోట్లు నిధులు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పంచాయతీల ఖాతాల్లోకి జమ కావడం జరిగింది. ఈ నిధుల ద్వారా పంచాయతీలలో అభివృద్ధి పనులను సక్రమంగా జరిగే విధంగా డిపిఒలకు, ఈవోఆర్డీలకు సూచనలు ఇచ్చాం.

కూటమి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం

వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

వైసిపి యువజన విభాగం నాయకులతో 'అనంత'

ప్రజాశక్తి -అనంతపురం

ప్రజావ్యతిరేక విధానాలపై గళం విప్పుతూ కూటమి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కోర్టు రోడ్డులోని క్యాంప్ కార్యాలయంలో వైసీపీ యువజన విభాగం అనంతపురము జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అనంతపురం నగర పరిధిలోని యువజన విభాగం నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి పార్టీకి అనుబంధ సంఘాలు ఎంతో కీలకమని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హామీల అమలులో చేతులెత్తేసిందని అన్నారు. రాజకీయాల్లో ఉన్న వారెవరైనా ప్రజల సంక్షేమమే ప్రథమ లక్ష్యంగా పని చేయాలని సూచించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు. పార్టీకి యువజన విభాగం సైన్యంలా పని చేయాలన్నారు. కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ అధిష్టానం నుంచి ఒక పిలుపు వస్తే ఆ సందేశాన్ని ప్రతి గడపకు చేర్చాలన్నారు. ఇందులో భాగంగా సోషల్ మీడియాను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ ప్రభుత్వంలో జరుగుతున్న దురాగతాలు, అన్యాయాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా బాహ్య ప్రపంచానికి తెలియజేయాలన్నారు. కూటమి నేతల్లో అప్పుడే విభేదాలు వచ్చాయని, ప్రతి విషయంలోనూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. వైఎస్ జగన్ పాలనకు, చంద్రబాబు పాలనకు మధ్య తేడాను వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. యువజన విభాగంలోని ప్రతి ఒక్కరూ నాయకత్వ లక్షణాలకు మెరుగుపర్చుకోవాలని తెలిపారు. వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ త్వరలోనే యువజన విభాగం జిల్లా, నియోజకవర్గ, నగర కమిటీల నియామకం పూర్తవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో వైసీపీ యువజన నాయకులు శ్రీనివాస్ గురుదత్తా, లోకనాథ్‌రెడ్డి, బుల్లే నాగార్జున, డివిజన్ల వారీగా నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు కేంద్ర హోంమంత్రి క్షమాపణ చెప్పాలి

అమిత్‌షా రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో నిరసనలు-'గో బ్యాక్' అంటూ నినాదాలు

రాయదుర్గంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా భారత జాతికి క్షమాపణలు చెప్పిన తర్వాతే దేశంలో తిరగాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. అమిత్‌షా రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని టవర్‌క్లాక్ సర్కిల్‌లో గాంధీ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఇందులో భాగంగా 'గోబ్యాక్ అమిత్‌షా' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, అప్రతిష్టాకరమైన వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అంబేద్కర్‌ను చిన్నచూపు చూస్తోందన్నారు. అంతేగాకుండా బిజెపి తన మనువాద సిద్ధాంతాన్ని ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తోందన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారమే ఇప్పుడు అమిత్‌షా మంత్రి పదవిలో ఉన్నాడన్నారు. టిడిపి, వైసీపీ, జనసేన పార్టీల కూడా అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి జిల్లా కమిటీ సభ్యులు ఆర్‌వి.నాయుడు, వై.వెంకటనారాయణ, ముర్తుజా, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, వలీ, ఇర్ఫాన్, నాయకులు రాజు, ఓబులేసు, వెంకటేశు, జీవ, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షా వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున డిమాండ్ చేశారు. అమిత్‌షా విజయవాడ పర్యటనను నిరసిస్తూ ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలోని వినాయక కూడలిలో నిరసన తెలిపారు. ఇందులో భాగంగా 'గో బ్యాక్ అమిత్ షా' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా అమిత్‌షాతోపాటు బిజెపి వైఖరిలో ఎలాంటి మార్పు రాకపోవడం దుర్మార్గమన్నారు. అదేవిధంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై ఇప్పటివరకు తమ వైఖరి ఏంటో తెలపకుండా అమిత్ షాను రాష్ట్రానికి ఆహ్వానించడాన్ని తప్పుపట్టారు. అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై నోరు మెదపకుండా ఉన్నారంటే వీరికి రాజ్యాంగం, అంబేద్కర్‌పై ఎంత మేరకు చిత్తశుద్ధి ఉందో ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోందన్నారు. ఇప్పటికైనా అమిత్‌షా దేశ పౌరులందరికీ బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు నాగరాజు, ప్రాంతీయ కమిటీ సభ్యులు మధు, తిమ్మరాజు, నగేష్ నాయక్, కృష్ణానాయక్, అశోక్, రవి, రామాంజి, ఆంజనేయులు, నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఇందులో భాగంగా 'అమిత్‌షా గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాకు రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదన్నారు. వెంటనే అమిత్‌షా దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ సభ్యులు ఓబులేసు, వన్నూరు స్వామి, హమాలీ సంఘం నాయకులు, అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.

ఉరవకొండ : రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ సిపిఐ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోనియా శీనా, జిల్లా ఉపాధ్యక్షులు బ్యాళ్ల ప్రసాద్, సిపిఐ నాయకులు సుల్తాన్, గౌస్, పురిడి తిప్పయ్య, గన్నే మల్లేష్, కాంగ్రెస్ నాయకులు అబ్బాస్, కుడాల రమేష్, తోపుడు బండ్ల కార్మిక సంఘం నాయకులు చెన్నరాయుడు, గంగాధర్, కూరగాయల వ్యాపార సంఘం నాయకులు అయ్యప్పరెడ్డి, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండలో నిరసన తెలుపుతున్న వామపక్ష, కాంగ్రెస్ పార్టీల నాయకులు

గుంతకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

గుంతకల్లు : కేంద్ర మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు వ్యతిరేకంగా ఆదివారం పట్టణంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త బిఆర్.అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, సిపిఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సిపిఎం, సిపిఐ నాయకులు జగ్గలి రమేష్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, సురేంద్ర, రంగమ్మ, షబ్బీర్, అబ్దుల్లా, చంద్ర, సిపిఐ నాయకులు రాము రాయల్, దేవేంద్ర, కుళ్లాయిస్వామి, రామాంజనేయులు యాదవ్, వెంకట్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నగరంలోని హెచ్ఎల్‌సి కెనాల్ వద్ద ఉన్న కబ్రాస్తాన్‌కు ప్రహరీ నిర్మించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈమేరకు ఆదివారం స్థానిక టిడిపి అర్బన్ కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను సిపిఎం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ హెచ్చెల్సీ వద్ద ఉన్న కబ్రాస్తాన్‌లో ప్రహరీ కూలిపోయిందన్నారు. దీంతో అంత్యక్రియలు నిర్వహించే సమయంలో ముస్లిములు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే లైట్లు వేయాలని, శుభ్రం చేయాలని కోరారు. ఇకపోతే శ్రీశ్రీ నగర్‌లో రోడ్లు, సైడ్ కాలువలు నిర్మించాలని విజ్ఞప్తి చేవారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, జిల్లా నాయకులు ఆర్‌వి.నాయుడు, నగర నాయకులు వలి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

22న అనంతలో 'డాకు మహారాజ్' విజయోత్సవ సభ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం వేదికగా సినీ హీరో నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ చిత్ర విజయోత్సవ సభను ఈనెల 22న నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వెల్లడించారు. ఆదివారం బాలకష్ణ అభిమాన సంఘాలతో కలిసి ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షులు గౌస్‌మోద్దీన్, ఎన్‌బికె హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షులు జగన్, నగర అధ్యక్షుడు శ్రీధర్, శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, నాయకులు రామలింగారెడ్డి, గంగారామ్, ముక్తియర్, గోళ్ల సుధాకర్ నాయుడు, సైపుద్దీన్, సుధాకర్‌యాదవ్, బొమ్మినేని శివ, ఎన్‌బికె ఫ్యాన్స్ చిరంజీవి, సాకే లక్ష్మీనరసింహా, వెంకటప్ప, పోతుల లక్ష్మీనరసింహులు, ధరూర్ ఓబుల్ నాయుడు, అమర్నాథ్, గన్నె రఘు, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE, TADIPATRI
O.S. N0.138/2022
Between:
Batta Ranganatha Chowdary ...**Plaintiff**
And
Batta Chandra Sekhar Naidu & Others ...**Defendants**
ప్రతివాదికి దావా సమను
To,
1.K.Padmavathi [D4], D/o. K.Narasaiah, W/o.Brahmayya, R/o.D.No.1/84-B, Nagaruru Village, Yadiki Mandal.
2.N.Padmavathi [D8], D/o. N.Srinivasulu W/o.Ramudu, R/o.D.No.1/28, Nagaruru Village, Yadiki Mandal.
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 14/02/2025 వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైనా ఆక్షేపణలు తెలుపుకొనవలెను.లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
G.ADENNA, Advocate
Ananthapuramu, Cell:9849767246
N.U.DEVANATHA REDDY,
Advocate Tadipatri.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE, TADIPATRI
I.A. No. 277/2022 in O.S. No.138/2022
Between:
Batta Ranganatha Chowdary ...**Petitioner/Plaintiff**
And
Batta Chandra Sekhar Naidu & Others ...**Respondents/Defendants**
Notice to Respondents
To,
1.K.Padmavathi [R4], D/o. K.Narasaiah, W/o.Brahmayya, R/o.D.No.1/84-B, Nagaruru Village, Yadiki Mandal.
2.N.Padmavathi [R8], D/o. N.Srinivasulu W/o.Ramudu, R/o.D.No.1/28, Nagaruru Village, Yadiki Mandal.
3.N.Sreedevi [R10], D/o. N.Sreenivasulu, W/o.Venkateswarlu, R/o.D.No.1/28, Nagaruru Village, Yadiki Mandal.
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 14/02/2025 వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైనా ఆక్షేపణలు తెలుపుకొనవలెను.లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
G.ADENNA, Advocate
Ananthapuramu, Cell:9849767246
N.U.DEVANATHA REDDY,
Advocate Tadipatri.

పుట్లూరు ఎస్ఐగా వెంకటనరసింహ

ప్రజాశక్తి-పుట్లూరు

మండల నూతన ఎస్ఐగా ఇవి.వెంకటనరసింహా ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న హేమాద్రి తిరుపతికి బదిలీ కాగా తిరుపతిలో విధులు నిర్వహిస్తున్న వెంకట నరసింహ పుట్లూరుకు వచ్చారు. దీంతో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పర్యవేక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

IN THE COURT OF HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE - CUM-FAMILY COURT MEDCHAL-MALKAJGIRI DIST. AT:: MALKAJGIRI
MC. No. 124 OF 2024
Between:
Smt. Henah Jameema & others, ...Petitioners
AND
A Rakesh Babu, ...Respondent
To.
A.Rakesh Babu, S/o. Late Venkat Rao, Age: 45 years, Occ: Private Employee, R/o. H.No.1-558-41A, Rajiv Gandhi Nagar, Kadri, Annathapur Dist., (A.P.) ...Respondent
Whereas the Petitioners namely Smt. Henah Jameema & others who are your wife and children have filed the maintenance case vide MC.No. 124 of 2024 on the file of the Hon'ble Principal District And Sessions Judge-Cum- Family Court, Medchal- Malkajgiri Dist., At. Malkajgiri, Hyderabad, Telangana State, the same is posted on **07.02.2025** for your appearance. You are hereby summoned to appear either in person or through your Advocate with your defense if any **at 10.30**a.m., on the above said date before the Hon'ble court, failing which the matter will be heard and determined ex-parte.
(BY ORDER OF THE HON'BLE COURT)
Place: Hyderabad,
Date: 19.01.2025
(J.MALLIKARJUN),
Advocate
Counsel for the Petitioners
H.No. 2-3-567/7/2, Plot No.40,
Road No.2, 2nd Cross, Sai Nagar,
Nagole, Hyderabad : 9848293556

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో సిడిఎంఎకు కార్మికుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు కోరారు. ఈమేరకు ఆదివారం జిల్లా పర్యనకు వచ్చిన సిడిఎంఎను మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని, నగర జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, రెగ్యులర్ కార్మికులకు బకాయి సరెండర్ లీవులు ఇవ్వాలని, జిపిఎఫ్ అకౌంట్లు తెరవాలని కోరారు. ఎన్ఎంఆర్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని కోరారు, మున్సిపల్ కార్మికులకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, మున్సిపల్ యూనియన్ సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, రెండవ పట్టణ కమిటీ అధ్యక్షులు గురురాజా, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, అధ్యక్షులు ముత్తురాజు, మున్సిపల్ యూనియన్ నగర కార్యదర్శి తిరుమలేశు, సభ్యులు, రాఘవ, ప్రభాకర్, సుబ్రమణ్యం, జయరామ్, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సిడిఎంఎకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

జగనన్న కాలనీలో ఇళ్లపట్టాలపై విచారణ చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణమూర్తి

ప్రజాశక్తి-ఉరవకొండ

కూడేరు మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలపై విచారణ చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం కూడేరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూడేరు మండల కేంద్రంలో ఉన్న జగనన్న కాలనీలో ఎక్కువ శాతం అనర్హులకే ఇళ్ల పట్టాలు ఇచ్చారని ఆరోపించారు. ఇప్పటికే అనర్హులు అందరూ పట్టాలను అమ్ముకుని లక్షలు దోచుకున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. జగనన్న కాలనీలో 160 మందికిపైగా ఇళ్లు మంజూరు చేస్తే నేటికీ పూర్తి కాలేదన్నారు. తక్షణమే కూడేరు మండల కేంద్రంలో ఇల్లు లేని పేదలను ప్రతి ఒక్కరికీ మూడు సెంట్లు స్థలంతోపాటు పక్కా ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. అలాగే జగనన్న కాలనీలో పట్టాలు అమ్ముకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.కరీంసాబ్, మండల నాయకులు సి.మల్లికార్జున, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

రెవెన్యూ ఎంప్లాయీస్ స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా రెవెన్యూ ఎంప్లాయీస్ స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైంది. ఆదివారం అనంతపురం నగరంలోని కష్ణ కళామందిరంలో జిల్లా రెవెన్యూ ఎంప్లాయిస్ స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రెవెన్యూ ఎంప్లాయిస్ స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గౌని సంజీవరెడ్డి, సెక్రటరీ పుట్లూరు హరిప్రసాద్‌రెడ్డి, ట్రెజరర్ కె.శ్రీనివాసమూర్తి, వైస్ ప్రెసిడెంట్‌లు టీ.హరిప్రసాద్, ఎన్. చంద్రరేఖ, పి.మూర్తి, ప్రసాద్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీలు పి.నారాయణస్వామి, ఎస్.షాహిద్ అక్రమ్, డి.భరత్ ఎన్నికల్లో పోటీ చేయగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ నాయకులు, సభ్యులను డిఆర్ఓ ఏ.మాలోల, ఆర్డీఓ కేశవనాయుడు అభినందించారు.



నూతన సభ్యులతో డిఆర్ఓ మలోల, ఆర్‌డిఓ కేశవనాయుడు

ఆధార్ ప్రత్యేక క్యాంపులు

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాలో అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకూ ఆధార్ క్యాంపులు నిర్వహినంచనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దానికి అనుగుణంగా అనంతపురం జిల్లాలో ప్రతి మండలం, ప్రతి మున్సిపాలిటీలో ఆధార్ క్యాంపునకు సంబంధించి షెడ్యూల్ వేశారు. గ్రామ వార్డు సచివాలయాలలో ఆధార్ సేవా కేంద్రాలు నిర్వహిస్తున్న కార్యదర్శులు, కామన్ సర్వీస్ సెంటర్ (సిఎస్‌సి) కలిపి షెడ్యూల్ వేశారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

అనంతపురం : డాక్టర్ అక్బర్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో రామకృష్ణ సేవా సమితి సారథ్యంలో నగరంలోని గంగానగర్‌లో ఉన్న ఎన్టీఆర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా దాదాపు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో కంటి సమస్యలు ఉన్నవారికి విడతలవారీగా డాక్టర్ అక్బర్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఆపరేషన్లు చేయనున్నట్లు డాక్టర్ అక్బర్‌సాహెబ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్లకోమా స్పెషలిస్ట్ డాక్టర్ అక్బర్ ఐ ఆసుపత్రి డాక్టర్ మిధునారెడ్డి, శ్రీ రామకృష్ణ సేవా సమితి ప్రెసిడెంట్ డాక్టర్ కృష్ణశశి, సెక్రటరీ వి.ప్రవీణ్‌కుమార్, ట్రెజరర్ జైపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ శ్రీధర్‌మూర్తి, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం జిల్లా నుంచి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా ఫిట్నెస్ పెంచుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్‌డిటి ఆధ్వర్యంలో నిర్వహించిన 10కె రన్, 5కె వాక్ నిర్వహించారు. ఇందులో భాగగంఆ కలెక్టర్ కార్యాలయం వద్ద పచ్చ, ఆరెంజ్ జెండాలు ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనంతపురంలో 10కె రన్, 5కె వాక్ 3వ ఎడిషన్ జనవరి 2025 కార్యక్రమాన్ని జరుగుతున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే విదేశాల నుంచి స్పెయిన్, అబ్రాడ్ నుంచి వచ్చిన వారికి అనంతపురం జిల్లా తరపున అభినందనలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఇక్కడ ఈ పోటీలో పాల్గొంటున్న యువతీయువకులకు, ఇక్కడ వచ్చినవారు శారీరకంగా వయసు పైబడిన కూడా మానసికంగా యుక్త వయసు కలిగిన వారిగా ఉన్నారని వారందరికి ధన్యవాదాలు తెలిపారు. ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంచూ ఫెర్రర్ మాట్లాడుతూ 10వ అల్ట్రా ఫెర్రర్ రన్నింగ్ వారం అన్నారు. పదేళ్ల క్రితం ఒకరితో ప్రారంభమై నేడు ఇంతమంది రన్నర్స్ రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. 10కె రన్‌లో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, కలెక్టరేట్ అనంతపురం స్పోర్ట్స్ విలేజ్ వరకు పోటీలో పాల్గొని విజయవంతంగా పరుగును పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి శ్రీనివాసరెడ్డి, ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలఫెర్రర్, ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి, జువాన్ మాన్యుయేల్ వియెరా (అల్టరన్నర్), వివిధ దేశాల నుంచి వచ్చిన రన్నర్లు, తదితరులు పాల్గొన్నారు.

పూర్తి సామర్థ్యంతో హంద్రీనీవా కాలువ నిర్మించాలి

జలసాధన సమితి నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

సమావేశంలో మాట్లాడుతున్న జలసాధన సమితి నాయకులు

పూర్తి నీటి సామర్థ్యంతో హంద్రీనీవా ప్రాజెక్టు కాలువలను నిర్మించాలని జలసాధన సమితి నాయకులు, ఒపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, పౌర ప్రగతిశీల వేదిక కార్యదర్శి తారకేష్, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి, జలసాధన సమితి జిల్లా కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని బీరప్ప గుడి ఫంక్షన్ హాల్‌లో జలసాధన సమితి కార్యదర్శి బి.సురేష్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హంద్రీనీవా ప్రాజెక్టును ప్రారంభించి 35ఏళ్లు అవుతున్నా ప్రాజెక్టు మాత్రం నేటికీ పూర్తి కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం హంద్రీనీవా కాలువ మల్యాల నుంచి జీడిపల్లి రిజర్వాయర్ వరకూ ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 3850 క్యూసెక్కులకు పరిమితం చేసి, జీడిపల్లి రిజర్వాయర్ నుంచి చిత్తూరు జిల్లా వరకు ప్రధాన కాలువ లైనింగ్ పనులు చేపట్టడానికి జీవో 404, 405ను విడుదల చేయడం శోచనీయమన్నారు. దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాయలసీమ రైతుల ప్రయోజనాల కోసం మల్యాల నుంచి జీడిపల్లి వరకూ 10వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కాలువను నిర్మించాలని, జీడిపల్లి రిజర్వాయర్ నుంచి చిత్తూరు జిల్లా వరకూ 6వేల క్యూసెక్కుల సామర్థ్యంతో లైనింగ్ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాయలసీమ నీటి ప్రాజెక్టులతోపాటు హంద్రీనీవాకు ఎక్కువ నిధులను కేటాయించి అనంతపురం జిల్లాలోనే 3.45 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సదస్సులో ఒపిడిఆర్ జిల్లా ఉపాధ్యక్షులు, న్యాయవాది నాగరాజు, జలసాధన సమితి నాయకులు దావీద్, ఆశాబీ, మోహన్‌నాయక్, జిలాన్, సత్తార్, రామాంజనేయులు, రాందాస్, బాషా, నారాయణ, సాంబ, విశ్వనాథ్, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండులో అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

అనంతపురం : నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లు దుకాణాలు నిర్వహిస్తున్న వారు అధిక ధరలకు తినుబండారాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ గౌస్ మొహిద్దీన్ హెచ్చరించారు. ఆదివారం అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోని దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా ఓ దుకాణంలో ఎంఆర్‌పి ధరకంటే అధిక ధరకు కూల్‌డ్రింక్ అముతుండగా ఓ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్‌లో దుకాణాలు ఏర్పాటు చేసుకున్న దుకాణదారులు ఎంఆర్‌పి ధరతోపాటు నాణ్యమైన తినుబండారాలనే విక్రయించాలన్నారు. అలాకాకుండా అధిక ధరకు నాసిరకంగా తినుబండారాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ప్రయాణికులు మోసపోకుండా బస్టాండ్‌లో అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా లీగల్ మెట్రాలజీ చట్టం, నిబంధనలను ప్రయాణికులకు వివరించారు. ఈ తనిఖీల్లో లీగల్ మెట్రాలజీ టెక్నికల్ అసిస్టెంట్ మహమ్మద్, ఆర్టీసీ డిపో మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు ఆధీనంలోకి పామిడి జామీయా మసీదు

పామిడి : పామిడి జామీయా మసీదును (మెయిన్ బజార్ లో ఉన్న పెద్ద మసీదు) జిల్లా వక్ఫ్‌బోర్డు ఆధీనంలోకి తీసుకున్నారు. ఈమేరకు జామియా మసీదు ముతవల్లి కాలపరిమితి ముగియడంతో వక్ఫ్‌బోర్డు అధికారులు నోటీసు బోర్డు అతికించి స్వాధీనం చేసుకున్నట్లు మతపెద్దలు తెలిపారు. ఇప్పటి నుంచి వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలోనే మసీదు కార్యకలాపాలు కొనసాగుతాయని తెలిపారు.

నేడు రోడ్డు విస్తరణ పనులు పరిశీలన

పామిడి : మండల కేంద్రంలోని సరస్వతి విద్యా మందిరం నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకూ త్వరలో నిర్మించనున్న రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోమవారం పరిశీలించనున్నట్లు స్థానిక టిడిపి నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు పనులను పరిశీలించడంతోపాటు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నూతన కమిటీ ఎన్నిక, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొననున్నట్లు తెలిపారు.

పంటకోత ప్రయోగాలు

పుట్లూరు : మండల కేంద్రంతోపాటు శనగలగూడూరు గ్రామాల్లో ఆదివారం పంటకోత ప్రయోగాలు నిర్వహించినట్లు వ్యవసాయ శాఖ ఎఒ కాత్యాయిని తెలిపారు. అలాగే మండల పరిధిలోని చిన్నమల్లేపల్లి గ్రామంలో రైతు సరస్వతమ్మ సాగు చేసిన కందిపంటలో ఎఇఒ హరి ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిఇఒ సూర్యానారాయణరెడ్డి, విహెచ్ఎ మురళి, బీమా ఏజెంట్ షమీర్, ప్రాథమిక కార్యకర్త విహెచ్ఎ మనోరమ, రైతులు పాల్గొన్నారు.

మోడల్ డీఎస్సీ పరీక్షకు అనూహ్య స్పందన

కళ్యాణదుర్గం రూరల్ : మోడల్ డీఎస్సీ పరీక్షకు అభ్యర్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో మోడల్ డీఎస్సీ పరీక్షకు నిర్వహించారు. ఈ పరీక్షకు వేలాది మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మోడల్ పరీక్ష నిర్వహించడం పట్ల ఇన్ఫినిటీ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్‌ను అభినందించారు. అనంతరం బద్దేనాయక్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో పెయింటర్ మృతి

మృతిచెందిన కృష్ణ

బెలుగుప్ప : కర్నూలు జిల్లా పత్తికొండ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన పెయింటర్ హరిజన కృష్ణ (36) మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కృష్ణ పెయింటింగ్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇందులో భాగంగానే పెయింటింగ్ పనికి పత్తికొండకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా వెళుతుండగా పత్తికొండ సమీపంలోని దాబా వద్దకు రాగానే నిలిచి ఉన్న ఇండియన్ గ్యాస్ సిలిండర్ లారీని ఢీకొన్నాడు. దీంతో అక్కడక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న భార్య బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. ఇంటి పెద్దదిక్కు మృతి చెందడంతో కుటుంబం ఎలా పోషించుకోవాలని భార్య తిమ్మక్క వాపోయింది. మృతుడికి కుమారుడు దుర్గాప్రసాద్, కుమార్తె దివ్యశ్రీ ఉన్నారు. విషయం తెలుసుకున్న మాజీ వైస్ ఎంపిపి గుడిపూడి తిమ్మప్ప మృతునికి నివాళు లర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పేకాటజూదరులు అరెస్టు

బొమ్మనహాల్ : మండలంలోని దర్గా హొన్నూరు గ్రామ సమీపంలో పేకాట జూదరులను అరెస్టు చేసి రూ.3,500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నబిరసూల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. దర్గాహొన్నూరు సమీపంలో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం రావడంతో దాడి చేసి నిందితులను అరెస్టు చేయడంతోపాటు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా పేకాటతోపాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జమేదారులు, ఇద్దరు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

టిడిపి నాయకులు రవికుమార్ మృతి

పుట్లూరు : తెలుగుదేశం పార్టీ నాయకులు నారాయణపల్లి గ్రామానికి చెందిన పొత్తూరు రవికుమార్‌నాయుడు ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సీనియర్ పాత్రికేయులు గన్నె పురుషోత్తం మృతి

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు గన్నే పురుషోత్తం ఆదివారం ఆకస్మికంగా మృతిచెందారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

యోగి వేమన గొప్ప సంఘ సంస్కర్త

జయంతి కార్యక్రమాల్లో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజాకవి యోగి వేమన గొప్ప సంఘ సంస్కర్త అని జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శనరావు అన్నారు. ఆదివారం నగరంలోని జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలో ఉన్న పరిపాలన భవనంలో యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషకు ఖండాంతర ఖ్యాతి ఆర్జించిన సుప్రసిద్ధ కవి వేమన అని కొనియాడారు. వేమన చాలా క్లిష్టమైన వేదంతసారంశాన్ని సైతం అలవోకగా తేలిక మాటల్లో చెప్పారని గుర్తు చేశారు. ఏ పద్యమైనా 'విశ్వదాభి రామ వినురవేమ' అనే మకుటంతో ముగించడం వేమన యొక్క గొప్పతనం అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, నివర్సిటీ డైరెక్టర్లు భానుమూర్తి, జి.ప్రశాంతి, వైశాలి ఘోర్పడే, కిరణ్మయి, నాగప్రసాద్ నాయుడు, సుబ్బారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, రామశేఖర్‌రెడ్డి, విసి పిఎలు శ్రీనివాసులు, నూర్ మహమ్మద్, రిజిస్ట్రార్ పిఎ అబ్బాస్‌అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం : వేమన పద్యాల్లోని నైతిక మానవతా విలువలతోపాటు ఆనాటి విజ్ఞాన అంశాలు వెలుగులోకి రావాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ హుసేన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ కళాశాల ప్రాంగణంలో ఫౌండేషన్ అధ్యక్షులు ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి అధ్యక్షతన వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమన మార్గం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. సమాజ పురోగతికి శాస్త్రీయ ఆలోచనలకు వేమన తాత్వికత ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతకు వేమన ఫౌండేషన్ కార్యక్రమాల నివేదికను కార్యదర్శి అప్పిరెడ్డి హరినాథరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమం విశ్రాంత ఆచార్యులు బయారెడ్డి, రవీంద్రారెడ్డి, సామాజిక నాయకులు కెవి.రమణ, విశ్రాంత ఉద్యోగులు మనోహర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కవి టివి.రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు లోకన్న, కృష్ణారెడ్డి, నాగశేషారెడ్డి, పరంధామరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య ఆధ్వర్యంలో వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, ముఖ్య నాయకులు మాదినేని ఉమా మహేశ్వరనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో నివాళులర్పిస్తున్న దృశ్యం

వేమనకు నివాళులర్పిస్తున్న జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి

గుత్తి : ప్రజాకవి యోగి వేమన జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని యోగివేమన అభివృద్ధి కమిటీ నాయకులు కోరారు. వేమన అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గుత్తిలోని వివేకానంద పాఠశాలలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వేమన అభివృద్ధి వేదిక నాయకులు వై.రాజశేఖర్‌రెడ్డి, పి.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ కవుల్లో అతిగొప్ప కవి అయిన వేమన జయంతిని సెలవుదినంగా ప్రకటించాలన్నారు. అలానే ప్రభుత్వ పుస్తకాల్లో దేశ వ్యాప్తంగా ఆయన పద్యాలు ప్రచురణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి జి.విశాలాక్షి, జయరామిరెడ్డి, విజయభాస్కర్, వెంకటేష్, సుభాష్‌రెడ్డి, వివేకానంద పాఠశాల సలహాదారు నరసింహులు, హెడ్‌మాస్టర్ శారద, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్‌కు నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టు ప్రసాద్ మృతికి నివాళి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జర్నలిజం రంగంలో తనదైన సేవలు అందించిన ప్రెస్ క్లబ్ పెద్దాయన, మొదటి తరం సీనియర్ జర్నలిస్టు నందినేని దేవప్రసాద్ నేటి, భవిష్యత్ తరాల జర్నలిస్టులకు ఆదర్శప్రాయులని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఎపియూడబ్ల్యూజె) జిల్లా అధ్యక్షులు పయ్యావుల ప్రవీణ్ అధ్యక్షతన ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ప్రసాద్ సంతాప సభ నిర్వహించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు నందినేని దేవప్రసాద్ ఉన్న వ్యక్తిగత వత్తి గత అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. కొందరు ఆయనతో ఉన్న ఆత్మీయ సంబంధాన్ని గుర్తుచేసుకొని భావోద్వేగానికి లోనయ్యారు. అజాతశత్రువుగా అందరికీ మిత్రుడుగా సేవలందించారని, జర్నలిస్టుగా అన్నిరంగాల వారికి సుపరిచితుడైన ఆయన లేని లోటు తీర్చలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్త బ్యూరో ఇన్‌ఛార్జి రాచమల్లు భోగేశ్వర్ రెడ్డి, ఎపియూడబ్ల్యూజె జిల్లా ప్రధాన కార్యదర్శి ఆయుష్, సీనియర్ జర్నలిస్టులు మార్కండేయులు, ప్రభాకర్‌నాయుడు, ప్రజాభూమి ఎడిటర్ కెపి.కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జయరామ్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు జగదీష్, సబ్ ఎడిటర్ రామాంజనేయులు, పూలశెట్టి చలపతి, రిపోర్టర్లు శివారెడ్డి, సాయిప్రసాద్, ఆంధ్రప్రభ ఎడిషన్ ఇన్‌ఛార్జి లోకరాజు, సీనియర్ జంబుల రమేష్‌రెడ్డి, ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ప్రెసిడెంట్ డేనియల్, ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్ట్ కృష్ణ, జర్నలిస్టులు నాగేంద్రరెడ్డి, బీవీ.రెడ్డి, ఆనందవర్ధన్, భుజంగరావు, రామచంద్ర, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగింపు

గుత్తి : మండలంలోని ఈశ్వరపల్లికి వెళ్ళు రహదారిలో ఉన్న కంపచెట్లు, ముళ్ళ పొదలను నాయకులు ఆదివారం తొలగించారు. బ్రాహ్మణపల్లి గ్రామం నుంచి ఈశ్వరపల్లి వరకు వెళ్ళు రహదారి ఇరువైపులా కంప చెట్లు, ముళ్లపదలు ఏపుగా పెరిగాయి. దీంతో ఇరు గ్రామాలకు చెందిన ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యని గ్రామ సర్పంచి నగరూరు సుమలత, టిడిపి నాయకుడు నగరూరు రాజశేఖర్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని జెసిబి సాయంతో రహదారి పక్కలో ఉన్న కంపచెట్లు, ముళ్లపదలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రంగారెడ్డి, టిడిపి నాయకులు ఆనంద గోపాల్, ఓబులయ్య, స్టోర్ డీలర్ వీరాంజనేయులు, రామ కొండయ్య, నందీశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని గొల్లకొండ కింద ఉన్న శ్మశాన వాటికలో ఆదివారం జెసిబితో కంపచెట్లు తొలగించారు. ఇటీవల మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో శ్మశానంలో కంపచెట్లు తొలగించాలని స్థానికులు వినతిపత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే మండల కేంద్రంలోని శ్మశాన వాటికలో పెరిగిన కంపచెట్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఏపి నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఆదినారాయణ, తెలుగు యువత మండల అధ్యక్షులు కాయల సురేష్‌యాదవ్, మిట్టా పవన్, శంకర్‌గౌడ్, ఐటిడిపి ఛాంపియన్ ముని, కాయల శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్లను తొలగిస్తున్న జెసిబి

నేటి నుంచి పశు వైద్యశిబిరాలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కాయసముద్రం ప్రాంతీయ పశు వైద్యశాల పరిధిలోని బుక్కారాయసముద్రం, నార్పల మండలాల్లో ఈనెల 20 నుంచి 31వతేదీ వరకూ ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు బుక్కరాయసముద్రం సహాయ సంచాలకులు డాక్టర్ ఎవి.రత్నకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పశువులు, దూడలు, గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. బుక్కరాయసముద్రం మండలంలో 20న పి.చదుళ్ళ, దయ్యాలకుంటపల్లి, 21న కె.చదుళ్ళ, ఏడావులపర్తి, 22న పొదరాళ్ల, దండువారిపల్లి, 23న ఆర్.కొత్తూరు, వెంకటాపురం, 24న బి.కొత్తపల్లి, కె అగ్రహారం, 25న భద్రంపల్లి, సంజీవపురం, 26న కొర్రపాడు, బుక్కరాయసముద్రం, 27న రెడ్డిపల్లి, నీలారెడ్డిపల్లి, 28న రోటరీపురం, బొమ్మలాటపల్లి, 29న అమ్మవారిపేట చెన్నంపల్లి, 30న గోవిందంపల్లి, సిద్ధరాంపురం, 31న జంతులూరు, పసులూరు గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే నార్పల మండలంలో 20న చామలూరు, బొందలవాడ, 21న నిలువురాయి, సిద్ధరాచెర్ల, 22న నడిమిదొడ్డి, దుర్గం, 23న గడ్డంనాగేపల్లి, బండ్లపల్లి, 24న కేసేపల్లి, నల్లపరెడ్డిపల్లి, 25న నాయనపల్లి, హెచ్.సోదనపల్లి, 26న సుల్తాన్‌పేట, బి.పప్పూరు, 27న పులసలనూతల, మంగపట్నం, 28న దుగుమర్రి, గుంజేపల్లి, 29న గూగూడు, గొల్లపల్లి, 30న రంగాపురం, గంగనపల్లి, 31న నార్పల తుంపెర గ్రామాల్లో శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కళ్యాణదుర్గం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 20 నుంచి 31వతేదీ వరకూ రోజూ రెండు ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు కళ్యాణదుర్గం పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్.శ్రీనివాసగుప్త ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళ్యాణదుర్గం పరిధిలోని కళ్యాణదుర్గం, బెలుగుప్ప మండలాల్లో రోజూ వైద్య సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి పశువులకు వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు.

బ్రహ్మసముద్రం : సోమవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకూ మండల వ్యాప్తంగా ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశు వైద్యాధికారి నవీన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఆయా శిబిరాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు, దూడలకు నట్టల నివారణ కార్యక్రమం, ఆరోగ్య శిబిరం, కృత్రిమ గర్భధారణ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ ట్రెజరర్‌గా కె.శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి-నార్పల

జిల్లా రెవెన్యూ ఎంప్లాయీస్ స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ ట్రెజరర్‌గా నార్పల డిప్యూటీ తహశీల్దార్ కె.శ్రీనివాసమూర్తి ఎన్నికయ్యారు. ఆదివారం అనంతపురంలోని కృష్ణ కళా మందిర్‌లో జిల్లా రెవెన్యూ ఎంప్లాయీస్ స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రెజరర్‌గా శ్రీనివాసమూర్తిని ఎన్నుకున్నారు. దీంతో నార్పల తహశీల్దార్ అరుణకుమారి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ జ్యోతిరాణి, సర్వేయర్ బ్రహ్మానంద, మండల విఆర్‌ఒలు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, శ్రీనివాసమూర్తిని ప్రత్యేకంగా అభినందించారు.

'పూల మీద వాలిన తేనెటీగ' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కవి తూమచర్ల రాజారామ్ రచించిన పూల మీద వాలిన తేనెటీగ పుస్తకాన్ని ప్రముఖ రచయిత శాంతి నారాయణ, లక్ష్మీనరసయ్య ఆవిష్కరించారు. ఆదివారం కొత్తూరు బాలుర జూనియర్ కళాశాలలో స్పందన అనంత కవుల వేదిక, హైదరాబాద్ కవి సంగమం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పుస్తక ఆవిష్కరణకు రచయిత కవులు శాంతి నారాయణ, గుంటూరు లక్ష్మీనరసయ్య, స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ శాస్త్రి, యాకూబ్, రాజారామ్, అంకె శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ రఘునాథ రెడ్డి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరిం చారు. ప్రతి కవిత్వ విమర్శ ఒక ఆత్మకథ అంటూ ఆస్కార్ వైల్డ్ మాటలని గుర్తు చేశారు. సజనాత్మకత నుంచి సాంకేతికత వైపు నడుస్తున్న కాలంలో పూర్వ విమర్శకులను గౌరవిస్తూ కవిత్వ విమర్శ రాస్తున్న రాజారామ్ మరిన్ని విమర్శనా గ్రంథాలు రాయాలన్నారు. కవుల కవిత్వాన్ని చదువుతున్నప్పుడు తనలో కలిగిన భావాలే తన విమర్శ వ్యాసాలని, అవి యువ కవులకు, విమర్శకులకు కొత్త చూపును కలిగిస్తే తన కషి ఫలించినట్లేనని పుస్తక రచయిత తూముచర్ల రాజారామ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు, కథా విమర్శకులు విశ్వనాథరెడ్డి, నాగేంద్ర, ఈరన్న, యాములపల్లి నర్సిరెడ్డి, తరిమెల అమరనాథరెడ్డి, చెట్ల ఈరన్న, జెట్టి జైరామ్, సతీష్ చంద్ర, అక్బర్, డాక్టర్ ప్రగతి తదితర సాహితీవేత్తలు పాల్గొన్నారు.

సిపిఐ ఎంఎల్ నేత పెద్దన్న స్తూపం ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.పెద్దన్న స్తూపాన్ని ఆవిష్కరించారు. ఆదివారం సిపిఐఎంఎల్ నాయకులు పెద్దన్న మొదటి వర్ధంతి సభను నగరంలోని రజకనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ పెద్దన్న పేదల కోసం చేసిన సేవలను, ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలను వివరించారు. తరిమెల నాగిరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు పెద్దన చేసిన సేవలు మరువలేని మరువలేనివని, అమరుల ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు పెద్దన్న చూపిన బాటలో నడవాలన్నారు. ఊరు బాటలో నడవాలని, ప్రజలు చైతన్యవంతమై ప్రజా సమస్యలపై వెలుగెత్తి చాటి ఉద్యమ బాటలో నడిచినప్పుడే పెద్దన్న ఆశయాలు నెరవేరినట్లు అవుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పెద్దన్న చేసిన పోరాటాలను గుర్తు చేస్తూ కళాకారులు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి.

కామ్రేడ్ పెద్దన్న స్తూపం

ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నేతలు, ఆ పార్టీ అనుబంధ సంఘాల రాష్ట్ర నేతలు ఝాన్సీ, డాక్టర్ విజయ, కిషోర్, లక్ష్మీ, మాధవ రెడ్డి, నాగరాజుతో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు చాకలి రంగన్న, నాగేశ్వరరావు, పరమేష్, మూర్తి, దస్తగిరి, చంద్రశేఖర్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.